సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 15 । అక్టోబర్ । 2025



ఆరోగ్య సంరక్షణకు చర్యలు

చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు చర్యలు చేపట్టినట్టు డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి అన్నారు. 10లో ▸



పనులు సాగవు

మాడ్గుల–యాచారం మండలాల సరిహద్దు కలిసే రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. 10లో ▸



అభివృద్ధికి సహకారం

ఆలయాల అభివృద్ధికి ఆర్థిక సహకరిస్తామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ నుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. 10లో ▸

న్యూస్‌రీల్

గోవులను రక్షించుకుందాం



మాట్లాడుతున్న తెలంగాణ ప్రాంత గో సేవా ప్రముఖ్ వెంకట నివాస్‌జీ

ఇబ్రహీంపట్నం: గో సంతతిని కాపాడుకోవాలని, గోవులను రక్షించుకుంటేనే ప్రకృతి పరంగా జీవరాసులన్నింటికీ మంచి భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ ప్రాంత గో సేవా ప్రముఖ్ వెంకట నివాస్‌జీ అన్నారు. జిల్లా స్థాయి గో విజ్ఞాన పరీక్షలను మంగళవారం ఇబ్రహీంపట్నంలోని త్రిశక్తి అలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గో సంతతి పెరిగితేనే భూసారం పెరుగుతుందని తెలిపారు. గోవుల పాల ఉత్పత్తులతోపాటు గో ఆధారిత వ్యవసాయం చేస్తే మనమంతా ఉండగలుగుతామన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పుడు 30 కోట్ల జనాభా, 80 కోట్లకు పైగా పశు సంతతి ఉండేదని చెప్పారు. ప్రస్తుతం 20 కోట్ల పశువులు మాత్రమే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పశుసంతతిని పెంపొందించుకునేందుకు, వాటిని రక్షించుకునేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విభాగ్, జిల్లా గో సేవా ప్రముఖులు వేణుగోపాల్, రచమళ్ల అబ్బయ్య, సుధాకర్‌రెడ్డి, బుగ్గవరపు రమేష్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామేల్

ఇబ్రహీంపట్నం: సీజేఐ గవాయ్‌పై దాడి అంటే రాజ్యాంగం, పార్లమెంట్, దేశం మొత్తంపై జరిగిన దాడిగా చూడాల్సిందేనని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సీజేఐపై దాడిని నిరసిస్తూ కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామెల్ అధ్యక్షతన మంగళవారం ఇబ్రహీంపట్నంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సామెల్‌తోపాటు కార్యదర్శి ప్రకాశ్ కారత్, బీఎస్పీ నాయకుడు కొంద్రు రఘుపతి, తెలంగాణ ఉద్యమకారులు బోసుపల్లి వీరేష్‌కుమార్, రాములు, మారయ్య, పూసల సంఘం రాష్ట్ర నాయకుడు పురుషోత్తం, రజక సంఘం నాయకుడు ముదిగొండ అజయ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాడి చేసిన.. దాని వెనుకల ఉన్న నిందితులను కఠినంగా శిక్షిస్తేనే భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఉంటాయన్నారు. సమావేశంలో వెంకటేశ్, బండి సత్తయ్య, కాలె గణేశ్, కాళ్ల జంగయ్య, ఎం.రాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

నేడు అసైన్డ్ భూములపై రైతులతో సమావేశం

యాచారం: మండలంలోని మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన సర్వే నంబర్ 19, 68, 127లోని అసైన్డ్, ప్రభుత్వ భూములపై గ్రామ రైతులతో బుధవారం సమావేశం ఉంటుందని తహసీల్దార్ అయ్యప్ప తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. నోటిఫికేషన్ వేసిన 820 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి ఏం చేయాలనే విషయమై చర్చించడం జరుగుతుందని ఆయన వివరించారు.

రేషన్ కమీషన్ విడుదల చేయండి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన రేషన్ డీలర్లు

మహేశ్వరం: పెండింగ్ కమీషన్ డబ్బులు విడుదల చేయాలని మంగళవారం పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీ రఘునందన్‌రావును రేషన్ డీలర్ల సంఘం నాయకులు కలిశారు. కమీషన్ సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. రాష్ట్రం, కేంద్రం నుంచి వచ్చే పెండింగ్ కమీషన్లను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో విడుదలయ్యే విధంగా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. మంత్రులు, ఎంపీని కలిసిన వారిలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హన్మాండ్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.లక్ష్మీనారాయణ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భానుగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయ్ సూర్య తదితరులు ఉన్నారు.

పర్యాటక మూసీకి..
పరుగులు తీసేలా..
నగరం నలువైపుల నుంచి సులువుగా వెళ్లేలా..

- రేడియల్ రోడ్లతో అనుసంధానం
- గండిపేట నుంచి ఫిల్మ్ సిటీ వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు
- కొత్వాల్‌గూడ నుంచి లగచర్ల వరకు రహదారి
- చందన్‌వెల్లి, సీతారాంపూర్ సెజ్‌లతో లింక్



సాక్షి, సిటీబ్యూరో: మూసీ సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. మూసీలో స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా చేయడంతో పాటు నది పరీవాహక ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ పర్యాటక మూసీకి నగరం నలువైపుల నుంచి సులువుగా చేరుకునేలా పటిష్టమైన రహదారి వ్యవస్థ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు తొలి దశలో మూసీకి పునరుజ్జీవం కల్పించనున్న గండిపేట నుంచి పలు మార్గాలలో గ్రీన్‌ఫీల్డ్ రహదారులను నిర్మించనున్నారు. దీంతో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నగరం నలుదిక్కుల నుంచి మూసీకి రాకపోకలు సులువవుతాయని అధికారులు భావిస్తున్నారు.

గండిపేట టు ఫిల్మ్ సిటీ

మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టులో భాగంగా తొలి దశలో జంట జలాశయాల నుంచి బాపూ ఘాట్ వరకు 21.5 కి.మీ. మేర అభివృద్ధి చేయనున్నారు. ఇందులో ఫేజ్–1ఏ కింద హిమాయత్‌సాగర్ నుంచి బాపూ ఘాట్ వరకు 9.5 కి.మీ., ఫేజ్–1 బీ కింద ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూ ఘాట్ వరకు 11 కి.మీ. వరకు ఉంటుంది. కంపుకొట్టే మూసీలో స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా చేయడంతో పాటు నది పరీవాహక ప్రాంతమైన గండిపేటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా నగరం నలువైపులా గండిపేటకు రాకపోకలు సులువుగా సాగేలా కొత్త రహదారులను నిర్మించాలని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు ప్రతిపాదించారు. నగరంలోని ఓఆర్‌ఆర్‌ను ఓఆర్‌ఆర్‌తో అనుసంధానించమే లక్ష్యంగా పలు రేడియల్ రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా గండిపేట నుంచి ఫిల్మ్ సిటీ వరకూ మూసీ వెంట కొత్త రోడ్డును నిర్మించనున్నారు. దీంతో గండిపేట సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) నుంచి ఫిల్మ్ సిటీ వద్ద ఓఆర్‌ఆర్ వరకు ప్రస్తుత దూరం 85 కి.మీ.గా ఉండగా.. ఈ ప్రతిపాదిత రోడ్డుతో ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా ఏకంగా 30 కి.మీ. దూరం తగ్గుతుంది.

‘గేట్ వే ఆఫ్ హైదరాబాద్’

దేశానికి ముఖద్వారమైన ‘గేట్ వే ఆఫ్ ముంబై’ తరహాలో తెలంగాణకు ‘గేట్ వే ఆఫ్ హైదరాబాద్’ ఐకానిక్ నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రపంచ పర్యాటకులను స్వాగతించేలా హిమాయత్‌సాగర్ సమీపంలో గాంధీ సరోవర్ వద్ద ఈ నిర్మాణాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రతిపాదిత గేట్ వే ఆఫ్ హైదరాబాద్‌ను కనెక్టివిటీ హబ్‌గా అభివృద్ధిపరుస్తారు. ఈ ఐకానిక్ నిర్మాణం నుంచి కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లను కలుపుతూ చందన్‌వెల్లి, సీతారాంపూర్ సెజ్‌లకు రేడియల్ రోడ్‌తో అనుసంధానించనున్నారు. ఈ కొత్త గ్రీన్‌ఫీల్డ్ రోడ్ ఔటర్ రింగ్ రోడ్‌ను చించోలి హైవేకు కలుపుతుంది. దీంతో మూడు పారిశ్రామిక పార్క్‌లకు యాక్సెస్ మెరుగవుతుంది.

కల్చరల్ గ్రిడ్‌గా మూసీ


మూసీకి పూర్వవైభవం తీసుకురావాలంటే కేవలం నదిలో స్వచ్ఛమైన నీరు పారేలా చేయడం మాత్రమే కాదు.. నదిలో మురుగు నీరు చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. ఇందులో భాగంగా నది చుట్టూ మురుగు నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే నదిలో గోదావరి జలాలను పారేలా చేసేందుకు మల్లన్నసాగర్ ఆనకట్ట నుంచి 20 టీఎంసీల నీటిని తరలించి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను నింపే ప్రయత్నాలను ప్రభుత్వం చేపట్టింది.

- మూసీని బహుళ ప్రయోజనకారిగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ ఆదేశాల మేరకు తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు మరో ఆర్థిక చక్రంగా చేయనున్నారు. దశల వారీగా ఈ ప్రాజెక్టును హెచ్‌ఎండీఏ పరిధిలోని 55 కి.మీ. మూసీ నదిని పునరుజ్జీవం కల్పించనున్నారు. మూసీని వాటర్ గ్రిడ్‌గా మాత్రమే కాకుండా సాంస్కృతిక గ్రిడ్‌గా కూడా అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వం మంచిరేవులలోని 800 ఏళ్ల నాటి పురాతన శివాలయం, పాతబస్తీలోని మసీదు, సిఖ్‌చావనీలోని గురుద్వారా, ఉప్పల్‌లోని మెదక్ కేథడ్రిల్ తరహాలో చర్చిని అభివృద్ధి చేస్తారు.

పదవుల్లో కీలకం



బత్తుల శివధర్‌రెడ్డి



ముదిరెడ్డి కోదండరెడ్డి



కర్నాటి ప్రతాప్‌రెడ్డి

- పుట్టినగడ్డపై మమకారం
- ఒకరు రాష్ట్రానికే పోలీస్ బాస్
- ఇంకొకరు కాకతీయ వర్సిటీ వీసీ
- మరొకరు వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్
- మురిసిపోతున్న 'పట్నం' గడ్డ

యాచారం: రాష్ట్రాన్ని శాసించే కీలక పదవుల్లో ఇబ్రహీంపట్నం ప్రాంత వాసులు కొనసాగుతున్నారు. అంతా వ్యవసాయ, రైతు కుటుంబాల నుంచి వచ్చిన వారే కావడం విశేషం. అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం ఉన్నత హోదాలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అటు రాష్ట్ర సేవలో తలమునకలవుతూనే ఇటు వీలుచిక్కినప్పుడలా పుట్టిన గడ్డకు తోడ్పాటునందిస్తూ ముందుకు సాగుతున్నారు. కీలక పదవుల్లో ఉన్న తమ ప్రాంత వాసులను చూసి స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

డీజీపీగా శివధర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం మండలం పెద్దతుల్ల గ్రామానికి చెందిన బత్తుల శివధర్‌రెడ్డి డీజీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొన్నేళ్లుగా పోలీస్ శాఖలో పలు కీలక పోస్టుల్లో పనిచేసి పదవికే వన్నె తెచ్చిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌లో కీలకమైన పోలీస్ బాస్‌గా బాధ్యతలు చేపట్టారు. వ్యవసాయ, రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన కష్టపడి చదివి ఐపీఎస్‌గా ఎంపికై ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పలు జిల్లాలకు ఎస్పీగా, ఇంటెలిజెన్స్ బాస్‌గా విధులు నిర్వర్తించారు. పోలీస్ బాస్‌గా సేవలందిస్తూ ఇబ్రహీంపట్నం నియోజవర్గం ప్రజలు ఎక్కడ కనిపించినా ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటారు. యువత కనిపిస్తే కష్టపడి చదవాలి.. ఉన్నత ఉద్యోగాలు సాధించి పుట్టినగడ్డకు మంచి పేరు తేవాలని హితబోధ చేస్తూ.. వారిలో స్ఫూర్తిని నింపుతుంటారు.

రైతు కమిషన్ ఛైర్మన్‌గా కోదండారెడ్డి

యాచారం మండల కేంద్రానికి చెందిన ముదిరెడ్డి కోదండరెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చినవారే. విద్యార్థి నేతగా, యువ నేతగా అంచెలంచెలుగా ఎదిగి నగరంలోని ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా, హుడా ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. తాజాగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్‌గా ఏడాదిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంజయ్య, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, రోశయ్య, డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తదితర సీఎంలతో సన్నిహితంగా మెలిగారు. ప్రస్తుతం ఫార్మాసిటీ రద్దు చేయించడం, భూభారతి చట్టం తీసుకురావడం, ఫ్యూచర్‌సిటీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించేలా పాటుపడుతున్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంత రైతులు ఎక్కడ కనిపించినా వారి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు.

కాకతీయ వర్సిటీ వీసీగా ప్రతాప్‌రెడ్డి

యాచారం మండలం మొగుళ్లవంపు గ్రామానికి చెందిన కర్నాటి ప్రతాప్‌రెడ్డి కాకతీయ యూనివర్సిటీకి వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన కూడా రైతు కుటుంబం నుంచి వచ్చిన వారే. యాచారం, మాడ్గుల మండల కేంద్రాల్లో పదో తరగతి వరకు విద్యాభ్యాసం చేసిన ఆయన ఉన్నత చదువుల కోసం నగరానికి వెళ్లి ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నత పదవులు చేపట్టారు. ఉన్నత హోదాలో ఉన్నప్పటికీ వ్యవసాయంపై మక్కువను మాత్రం వదులుకోలేదు. సమయం చిక్కినప్పుడల్లా సాదాసీదాగా గ్రామానికి వస్తూ తన వ్యవసాయ పొలంలో పంటలను పరిశీలిస్తూ తోటి రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. యాచారం గ్రామస్తులు ఎక్కడ తారసపడినా యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటారు. వీసీగా వేలాది మంది యువతకు మార్గదర్శకుడిగా వారి ఉన్నతికి బాటలు వేస్తూ మన్ననలు పొందుతున్నారు.

కార్మికులకు మోదీ చేసిందేమీ లేదు
సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



ర్యాలీగా వెళ్తున్న నాయకులు, కార్మికులు

తుర్కయంజాల్: ప్రధాని నరేంద్రమోదీ సఫాయి కార్మికుల కాళ్లు కడుగుతూ ఫొటోలకు ఫోజులివ్వడం తప్ప వారి కడుపు నింపడం లేదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని చలసాని కల్యాణ మండపంలో సంఘం జిల్లా కార్యదర్శి డి. కిషన్ అధ్యక్షతన నిర్వహిస్తున్న తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర 5వ మహాసభలకు మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులను భానిసత్వంలోకి నెట్టేస్తూ, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. మోదీ పేదలు, కార్మికుల కోసం చేసిందేమీ లేదని, హామీలకే పరిమితమయ్యారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేసి సాధించుకున్న అనేక లేబర్ కోడ్‌లను ఎత్తివేశారని దుయ్యబట్టారు. అంతకుముందు నాయకులు, కార్మికులు భారీ ర్యాలీగా రాగన్నగూడలోని జిల్లా కార్యాలయం నుంచి తరలివచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఎస్.వి.రఘు, కార్యదర్శి జె.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి రాజమల్లు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, చంద్రమోహన్, నాయకులు ఈ.నరసింహ, జగదీష్, స్వప్న, సత్యనారాయణ, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

28 మద్యం దుకాణాలకు 308 టెండర్లు

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న టెండర్ల ప్రక్రియలో భాగంగా హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 28 షాపులకు 308 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ ధన్వంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఒక్క రోజే 86 అప్లికేషన్లు రాగా బండరావిరాలలో ఎస్టీ రిజర్వు అయిన దుకాణానికి ఒక్కటి కూడా రాలేదని చెప్పారు. ఈ నెల 18తో టెండర్ల ప్రక్రియ ముగియనుందని ఆయన పేర్కొన్నారు.

న్యాయం జరిగేలా చూడండి



మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కద్లాల్: గ్రీన్‌ఫీల్డ్ ట్రిపుల్‌ఆర్ రోడ్డు భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు మంగళవారం హైదరాబాద్‌లో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఆయా రోడ్ల నిర్మాణంతో భూములు కోల్పోవడంతో పాటు రైతులకు కలిగే ఇబ్బందులను వివరించారు. అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ జోగు వీరయ్య, మాజీ ఉప సర్పంచ్ ముత్యాలు, నాయకులు భిక్షపతి, వంశీ, లక్ష్మణ్, నర్సింహ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు

ఇబ్రహీంపట్నం రూరల్: టీజీఐఐసీకి భూములు కోల్పోయిన అర్హులైన రైతులందరికీ ఇంటి స్థలాలు ఇస్తామని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎల్మినేడులో మంగళవారం భూ సేకరణ, రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు పర్యటించారు. పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూ పరిరక్షణ సమితి, ఇతర రాజకీయ పార్టీల నాయకులు వేర్వేరుగా ఆర్డీఓకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద అర్హుల జాబితా ఉందని స్పష్టం చేశారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ప్రభుత్వం చేసిన ఎంజాయ్‌మెంట్ సర్వే ఆధారంగా త్వరలోనే లే ఔట్ చేసి ప్లాట్లు అప్పగించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం సేకరణ

- అక్రమాలకు తావివ్వొద్దు
- రైతులకు ఇబ్బంది రానివ్వొద్దు
- కొనుగోళ్లు సాఫీగా సాగాలి
- అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ధాన్యం సేకరణలో అక్రమాలకు తావు లేకుండా, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా కొనుగోళ్లు సాగేలా చూడాలని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం వానాకాలం పంట ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కొనుగోలు కేంద్రాల అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, మిల్లర్లు, సివిల్ సప్లయ్ అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 34 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. దాదాపు 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని, 6 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. ఎఫ్ఏ క్యూ ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్య పర్చాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. ధాన్యం సరఫరాకు వాహనాలను సమకూర్చుకోవాలని అన్నారు. అకాల వర్షాలతో తడిసిపోకుండా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ట్రక్ షీట్లలో అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను కేంద్రాలకు సమకూరుస్తున్నట్టు వెల్లడించారు. జిల్లా యంత్రాంగం తరపున అన్ని సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. సదస్సులో డీఎస్‌ఓ వనజాత, సివిల్ సప్లై డీఎం హరీష్, డీసీఓ సుధాకర్, జిల్లా వ్యవసాయాధికారి ఉష తదితరులు పాల్గొన్నారు.

నేవీలో మంచి అవకాశాలు



సదస్సులో మాట్లాడుతున్న కెప్టెన్ అశుతోష్ కుమార్ ఆపండ్కర్

కెప్టెన్ అశుతోష్ కుమార్ ఆపండ్కర్

హుడాకాంప్లెక్స్: ‘డీజీ షిప్పింగ్ సాగర్ మే సమ్మాన్’ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సరూర్‌నగర్ వీఎంహోంలో స్కూల్ విద్యార్థులకు పదో తరగతి, ఇంటర్ తరువాత ఉద్యోగావకాశాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీజీ షిప్పింగ్ నోడల్ ఆఫీసర్, ట్రెనింగ్ రెహమాన్ కళాశాల ప్రిన్సిపాల్ డా.అశుతోష్ కుమార్ ఆపండ్కర్ మాట్లాడుతూ.. పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు మర్చంట్ నేవీలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నేవీ రంగంలో మహిళలకు పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించాలని, మహిళా సాధికారత సాధించే లక్ష్యంతో ముదుకు వెళ్తున్నామని అన్నారు. మర్చంట్ నేవీలో 10వ తరగతి తరువాత ఒక సంవత్సరం శిక్షణ ఉంటుందని, ఇంటర్ తరువాత మూడేళ్ల బీఎస్సీ డిగ్రీ చదివిన వెంటనే వంద శాతం ఉద్యోగాలు మంచి వేతనంతో దొరుకుతాయని చెప్పారు. ట్రెనింగ్ షిప్ రెహమాన్ మర్చంట్ నేవీ శిక్షణలో అనేక కోర్సులు అందిస్తోందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మర్చంట్ నేవీలో విద్యార్థుల సంఖ్య పెరగాలని ఆకాంక్షించారు. మర్చంట్ నేవీలో ట్రెనింగ్ తీసుకుంటున్న విద్యార్థిని భీమగాని సత్య మాట్లాడుతూ.. విద్యార్థులు రొటీన్‌కు భిన్నంగా ఆలోచించాలని, ప్రత్యేక శిక్షణతో నేవీ రంగంలోకి అడుగు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు మనీషా పాండే, వీఎం హోం ప్రిన్సిపాల్ పి.నర్సింహారెడ్డి, సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు భీమగాని మహేశ్వర్ పాల్గొన్నారు.

ఆ పార్టీలవి కుట్ర రాజకీయాలు



బీసీ హాస్టల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ మల్లురవి

నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి

ఆమనగల్లు: రాష్ట్రంలో విపక్ష పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీలు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయని నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లురవి ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో సీఎస్‌ఆర్ నిధులు రూ.4 కోట్లతో నిర్మిస్తున్న బీసీ బాలుర వసతిగృహం నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ గుర్రం కేశవులు, పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర చెంచు యువజన సంఘం అధ్యక్షుడు మండ్లి రాములు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మాణయ్య పాల్గొన్నారు.

'వాహనాలపై స్టిక్కర్లు వేస్తే చర్యలు'

సిటీ కోర్టులు: వాహనాలపై అనధికారికంగా వివిధ స్టిక్కర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఆదేశించారు. ఈ మేరకు ఇటీవల నగరంలో మూడు వేర్వేరు వాహనాలపై అనధికారికంగా వేసిన స్టిక్కర్లను గుర్తించిన మిషన్ మంగళవారం సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. వెంటనే ఆ వాహనాలపై సమగ్ర విచారణ జరిపి తదుపరి విచారణలోపు నివేదిక దాఖలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీ, సెక్రెటరీ, బార్‌కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ, సెక్రెటరి, సమాచార ప్రజాసంబంధ శాఖ, రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ అధికారులకు నోటీసులు జారీ చేసింది.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ కార్యకర్త మృతి

అంతిమ యాత్రలో పాల్గొన్న ఆచారి



శేఖర్ పాడె మోస్తున్న ఆచారి

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన బీజేపీ కార్యకర్త జల్కం శేఖర్(36) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి మంగళవారం పరామర్శించారు. జల్కం శేఖర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోసారు.అదే విధంగా బాధిత కుటుంబాన్ని వివిధ పార్టీల, సంఘాల నాయకులు పరామర్శించారు.

పంచాయతీ ట్రాక్టర్ నుంచి బ్యాటరీ చోరీ



నందిగామ: పార్క్ చేసిన చాకలిదాని గుట్టతండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ నుంచి గుర్తు తెలియని దుండగులు సోమవారం అర్ధ రాత్రి బ్యాటరీ చోరీ చేశారు. కారోబార్ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. సోమవారం గ్రామంలో పనులు చేసిన తర్వాత సాయంత్రం పంచాయతీ కార్యాలయం ఆవరణలో ట్రాక్టర్‌కు తాళం వేసుకుని వెళ్లారు. మంగళవారం ఉదయం ట్రాక్టర్ తీసుకెళ్లేందుకు వెళ్లగా బ్యాటరీ చోరీ విషయం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గతంలో ఇదే పంచాయతీలో పలుమార్లు దొంగలు పడ్డారు. ఇప్పటికైనా పోలీసులు దర్యాప్తు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అదృశ్యమైన మహిళ.. శవమై తేలింది



కమల (ఫైల్)

మీర్‌పేట: బడంగ్‌పేటలో అదృశ్యమైన మహిళ మీర్‌పేట మంత్రాల చెరువులో శవమై తేలింది. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన ప్రకారం. బడంగ్‌పేట సమతానగర్‌కు చెందిన మీసాల కమల (55)కు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా ఆమె మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో చికిత్స తీసుకుంటోంది. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కమల ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయింది. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుమారుడు రాజశేఖర్ అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మంత్రాల చెరువులో మహిళ మృతదేహాన్ని గుర్తించిన వాకర్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు హైడ్రా సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని వెలికితీసి కమలగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కమల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిందని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌లో భాగంగా కార్గో వద్ద తనిఖీలు

శంషాబాద్: విమానాశ్రయంలో బాంబులు పెడితే వివిధ ఏజెన్సీలన్నీ సమన్వయంగా సమస్యను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై శంషాబాద్ విమానాశ్రయంలో మంగళవారం మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు ప్రతి సంవత్సరం నిర్వహించిన మాదిరిగా ఈ ఏడాది బాంబులు పెడితే కలిగే నష్టం..దానిని నివారించే విధానంపై డ్రిల్ చేపట్టారు. కార్గో ఏరియాలో చేపట్టిన ఈ డ్రిల్‌లో సీఐఎస్‌ఎఫ్ అధికారుల బృందంతో పాటు రక్ష సెక్యూరిటీ, వైద్యులు, రాష్ట్ర పోలీసులు, ప్రత్యేక పోలీసులు పాల్గొన్నారు. తనిఖీలు, నిర్వీర్యం, వైద్యసాయం తదితర అంశాలపై మాక్‌డ్రిల్ విజయవంతంగా పూర్తిగా చేశారు.

ముజ్రా పార్టీ భగ్నం



రిసార్ట్స్‌లో పోలీసుల దాడి

మహేశ్వరం: మహేశ్వరం ఠాణా పరిధిలోని కొరుపోలు చంద్రారెడ్డి (కేసీఆర్ రిసార్ట్స్) రిసార్ట్స్‌లో నిర్వహిస్తున్న ముజ్రా పార్టీ మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు భగ్నం చేశారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గట్టుపల్లి గ్రామంలోని కేసీఆర్ రిసార్ట్స్‌లో మంగళవారం వేద అగ్రికల్చర్ ఇన్నోవేషన్ సీడ్ కంపెనీ డైరెక్టర్ గాజులరామారానికి చెందిన తిరుపతి రెడ్డి, రాందాస్‌పల్లికి చెందిన రాక్‌స్టార్ హైబ్రిడ్ సీడ్ కంపెనీ డైరెక్టర్ సైదారెడ్డి వేర్వేరుగా విత్తన కంపెనీ డీలర్లకు విందు ఏర్పాటు చేశారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 20 మంది యువతులు, 52 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో రెండు కాటన్‌ల బీర్లు, మూడు ఫుల్‌బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. రిసార్ట్ యజమాని రాకేశ్‌రెడ్డి, ఈవెంట్ మేనేజర్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మరో నలుగురు బాలురపైనా లైంగిక దాడి!

సైదాబాద్: సైదాబాద్ జైలు గార్డెన్‌లోని ప్రభుత్వ బాలల సదనంలో ఒక బాలుడిపై ఔట్ సోర్సింగ్ ఉద్యోగి లైంగిక దాడి చేయడం కలకలం సృష్టించిన సంగతి విదితమే. అయితే పోలీసుల విచారణలో అతడు మరో నలుగురు బాలురిపైనా లైంగిక దాడులు చేశాడని తేలినట్లు తెలుస్తోంది. బాలుడిపై లైంగిక దాడి ఘటనను సీరియస్‌గా విచారిస్తున్న పోలీసులకు విస్తుపోయే విషయాలు వెల్లడవుతున్నాయని సమాచారం. ప్రస్తుతం సదనంలో 80 మంది బాలలు ఉండగా వారందరితో పోలీసులు ఒక్కొక్కరిగా మాట్లాడి విషయాలు రాబడుతున్నారు. ప్రస్తుతం సదనంలో కాకుండా ఇండ్లకు వెళ్లిన వారిని సైతం వారు విచారిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఓ బాలుడిపై దాడి విషయం వెలుగులోకి వచ్చిన తరువాత జువైనల్ విభాగం ఉన్నతాధికారులు మహిళా సూపరింటెండెంట్ మైథిలిని దర్యాప్తు అధికారిగా నియమించారు. ఆమె పూర్తి వివరాలతో నివేదికను అధికారులకు సమర్పించారు. ఇప్పటికే బాలుడిపై దాడి ఘటనలో నిందితుడైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రహమాన్‌ను విధుల నుంచి అధికారులు తొలగించారు. హెడ్ సూపర్‌వైజర్ షఫీని సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు ఉద్యోగులకు చార్జి మెమో జారీ చేశారు. సైదాబాద్ పోలీసుల విచారణ పూర్తయితే ప్రభుత్వ బాలల సదనంలో దాడుల విషయమై మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. బాలల సదనంలో లైంగిక దాడి ఘటనపై కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు పూర్తి నివేదిక పంపాలని అడిగారని తెలుస్తోంది.

హెచ్‌సీఏలో నకిలీ బర్త్ సర్టిఫికెట్ల కలకలం

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌సీఏపై మరో వివాదంవెలుగులోకి వచ్చింది. హెచ్‌సీఏలో నకిలీ, డబుల్ బర్త్ సర్టిఫికెట్లతో పలువురు క్రీడాకారులు ప్రవేశం పొందినట్లు ఓ బాధితుడి తండ్రి అనంత్ రెడ్డి మంగళవారం ఉప్పల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అండర్- 16, అండర్-19, అండర్-23 లీగ్ మ్యాచుల్లో పలువురు ప్లేయర్లు డబుల్ బర్త్ సర్టిఫికెట్లతో ఎక్కువ వయసు ఉన్నప్పటికీ లీగ్‌లో ఆడే విధంగా హెచ్‌సీఏ అవకాశం ఇచ్చిందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై గతంలో ఆరుగురు ప్లేయర్లను గుర్తించిన బీసీసీఐ..వారిపై నిషేధం విధించిందని ఆయన గుర్తు చేశారు. ఎక్కువ వయసు ఉన్న వారికి ఇలా అక్రమమార్గంలో లీగ్‌లో ఆడే అవకాశం ఇవ్వడం వల్ల ప్రతిభ ఉన్న నిజమైన క్రీడాకారులకు నష్టం వాటిల్లుతుందని ఆయన వాపోయారు. అవినీతికి పాల్పడుతూ టాలెంట్ లేకున్నా ప్లేయర్లను ఆడనిస్తున్న హెచ్‌సీఏ అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన సీపీకి ఫిర్యాదు చేశారు.

నిధులు అందవు.. పనులు సాగవు

- రెండేళ్లుగా కొనసాగుతున్న రోడ్డు నిర్మాణం
- ఎమ్మెల్యే ఆదేశించినా పురోగతి లేని వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



నిలిచిన కొత్తపల్లి-కొత్తపల్లి తండా బీటీ రోడ్డు పనులు



కొత్తపల్లి-కిషన్‌పల్లి బీటీ రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం(ఫైల్)

యాచారం: మాడ్గుల-యాచారం మండలాల సరిహద్దు కలిసే రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. పనులు ప్రారంభించి రెండేళ్లు దాటినా పనుల్లో పురోగతి లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఫిర్యాదులు చేసిన స్పందన లేదని వాపోతున్నారు. 2023 ఆగస్టు 24న అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కొత్తపల్లి-కొత్తపల్లి తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ నుంచి నిధులు మంజూరు చేయించి పనులకు శంకుస్థాపన చేశారు. పూర్తిగా అటవీ ప్రాంతంలో గుట్టల మధ్య నుంచి వెళ్లే మార్గాన్ని బీటీ రోడ్డుగా మారిస్తే యాచారం-మాడ్గుల మండలాల సరిహద్దు ప్రయాణికుల రాకపోకలకు సులభం అవుతుంది. పనులు ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

కొత్తపల్లి-కిషన్‌పల్లి రోడ్డు అంతే..

కొత్తపల్లి నుంచి మాల్ మార్కెట్‌కు చేరుకోవడానికి కిషన్‌పల్లి వరకు అదే రోజు పంచాయతీ రాజ్ శాఖ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు పూర్తయితే కొత్తపల్లి గ్రామస్తులకు ఆరుకిలోమీటర్ల దూరభారం తగ్గుతుంది. రెండేళ్లు దాటినా రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకనే సాగడంతో కొత్తపల్లి గ్రామస్తులకు ఇబ్బంది తప్పడం లేదు.

రూ.3.5 కోట్ల బకాయి

కొత్తపల్లి-కొత్తపల్లి తండా వరకు ఆరు కిలోమీటర్లు, కొత్తపల్లి-కిషన్‌పల్లి వరకు నాలుగు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం కోసం పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.7.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నేటి వరకు దాదాపు రూ.3.5 కోట్లు వెచ్చించి పనులు చేపట్టారు. ప్రభుత్వం నుంచి నయా పైసా రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పనులు సాగడం లేదని ఫిర్యాదులు చేస్తున్నారే తప్పా.. బిల్లులు ఎందుకు రాలేదో చెప్పడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. వడ్డీ తెచ్చి పనులు చేపడితే సకాలంలో బి ల్లులు అందక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సగం నిధులు ఇప్పించినా సకాలంలో పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

ఇబ్బందులు తప్పుతాయి



కొత్తపల్లి-కొత్తపల్లి తండా వరకు, కొత్తపల్లి-కిషన్‌పల్లి వరకు బీటీ రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రజలు ఇబ్బందులు తప్పుతాయి. రెండేళ్లుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి పలుమార్లు ఫిర్యాదులు చేశాం. అయినా పురోగతి లేదు. – ఎండీ ఫని, కొత్తపల్లి

సర్కార్‌కు చిత్తశుద్ధి లేదు



రోడ్డు నిర్మాణ పనుల విషయంలో సర్కార్‌కు చిత్తశుద్ధి లేదు. కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం అయ్యేలా చూడాలి. అసంపూర్తి రోడ్డుతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. – కావలి జగన్, మాజీ ఉప సర్పంచ్, కొత్తపల్లి

నిధులు రాకపోవడం నిజమే



కొత్తపల్లి-కిషన్‌పల్లి రోడ్డు పనులు నిధుల లేమితో నిలిచాయి. 30 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్‌కు నిధులు అందలేదు. పనులు కొనసాగుతున్నాయి. కొత్తపల్లి-కొత్తపల్లి తండా రోడ్డు పరిస్థితి కూడ అంతే. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం. – శ్రీనివాస్, పంచాయతీ రాజ్ డీఈఈ, ఇబ్రహీంపట్నం

ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు



సామూహిక సీమంతం కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి తదితరులు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. పోషణ్ అభియాన్ మహోత్సవంలో భాగంగా మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారుల తల్లులకు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే రోగనిరోధక శక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రొటీన్లు, విటమిన్లు, కార్బొహైడ్రేట్లు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. చిన్నారులకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలని అన్నారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఎంఈఓ మనోహర్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్న ప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెచ్ఎం రాంచందర్, ఎస్ఎంసీ సభ్యులు నవ్య, తులసి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి 'ఐక్యత' సహకారం

టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ ఆర్థిక సహకారం అందిస్తుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్ పరిధిలోని కర్కస్‌తండాలో మంగళవారం సుంకిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యాలుగా ఐక్యత ఫౌండేషన్ పనిచేస్తుందని చెప్పారు. అలాగే ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయాల పునరుద్ధరణ, అభివృద్ధి, నూతన ఆలయాల నిర్మాణం కోసం ఆర్థికసహకారం అందిస్తున్నామని వివరించారు. కల్వకుర్తి నియోజక వర్గంలో ఇప్పటివరకు 160 ఆలయాల అభివృద్ధికి సాయం అందించామని ఆయన గుర్తు చేశారు. కర్కస్‌తండాలో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి అవసరమైన ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, నాయకులు శంకర్ నాయక్, నర్సింహ, రవి, కరుణాకర్‌రెడ్డి, గోపాల్ నాయక్, శ్రీను, శివాజీ, మల్లేశ్, రాజేందర్, నార్య, సంతోశ్, కృష్ణ, బాలకోటి, దేవేందర్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కదలికలను గమనించి.. కళ్లలో కారం కొట్టి



చికిత్స పొందుతున్న బాధితురాలు సునీత

పుస్తెలతాడు చోరీ

- దుండగుడిని పట్టుకున్న కార్ వాషింగ్ సెంటర్ నిర్వాహకుడు
- నిందితుడికి రిమాండ్

శంకర్‌పల్లి: కొన్నాళ్లుగా మహిళ కదలికలను గమనిస్తున్న ఓ దుండగుడు ఇంట్లోకి దూరి కళ్లలో కారం చల్లి.. క్రికెట్ బ్యాట్‌తో దాడిచేసి పుస్తెలతాడును అపహరణకు యత్నించాడు. పారిపోతున్న దొంగను పట్టుకున్న స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మంగళవారం శంకర్‌పల్లి ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం సవర్గాన్‌కు చెందిన కుంబారే సిద్ధారెడ్డి, సునీత దంపతులు వారి కుమారుడు, కుమార్తెతో కలిసి నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం శంకర్‌పల్లికి వచ్చారు. పట్టణంలో టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. రోజుమాదిరిగానే టిఫిన్ సెంటర్‌కు వచ్చిన సునీత పిల్లలకు లంచ్ బాక్స్ కట్టేందుకు ఉదయం 11.30గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్లింది. కొన్నాళ్లుగా ఈ దంపతుల కదలికలను గమనిస్తున్న దుండగుడు మంకీ క్యాప్ ధరించి హఠాత్తుగా ఇంట్లోకి చొరబడ్డాడు. సునీత కళ్లలో కారం చల్లి.. క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసి మెడలోని పుస్తెలతాడును లాక్కుని పరారయ్యాడు. అక్కడే కార్ వాషింగ్ సెంటర్ నిర్వహిస్తున్న ప్రవీణ్ గమనించి వెంటనే పట్టుకుని తనిఖీ చేశాడు. బ్యాగులో కారం పొడి, మంకీ క్యాప్, పుస్తెలతాడు లభించింది. అప్పటికే సునీత భర్తకు సమాచారం ఇచ్చింది. ఘటనా స్థలికి చేరుకున్న సిద్ధారెడ్డి దుండగుడు టిఫిన్ సెంటర్ ఎదురుగా అద్దెకు ఉండే వాసు(45)గా గుర్తించాడు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన వాసు డైలీ ఫైనాన్స్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు చేవెళ్ల కోర్టులో హాజరు పరచారు. రిమాండ్ నిమిత్తం చర్లపల్లి జైలుకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వాటర్‌మెన్ మృతి



అంజయ్య (ఫైల్)

కందుకూరు: కందుకూరు పంచాయతీ పరిధిలో వాటర్ మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న రొట్టెల అంజయ్య(59) మృతి చెందారు. కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న ఆయన డయాలసిస్ చేయించుకుంటూనే విధులకు హాజరవుతున్నారు. సోమవారం రాత్రి మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేస్తుండగా గుండెపోటు రావడంతో మరణించారు. ఆయన గత 25 ఏళ్లుగా పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నారు. మంగళవారం నిర్వహించిన అంత్యక్రియల్లో గ్రామస్తులతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

పనికోసం వచ్చిన కూలీ అదృశ్యం



సుదేశ్ బ్రిజియా (ఫైల్)

మొయినాబాద్‌రూరల్: పనికోసం వచ్చిన కూలీ అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలోని అజీజ్‌నగర్‌లో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన సుదేశ్ బ్రిజియా ఈ నెల 11వ తేదీన అజీజ్‌నగర్ సమీపంలో శ్రీనిధి పాఠశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న బావమరిది అరుణ్ బ్రిజియా వద్దకు వచ్చాడు. ఈ నెల 12న సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు మంగళవారం మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎయిర్‌పోర్టులో ఈ-సిగరెట్ల పట్టివేత



శంషాబాద్ పట్టుబడ్డ ఈ-సిగరెట్లు

శంషాబాద్: దుబాయ్ నుంచి పెద్ద మొత్తంలో ఈ-సిగరెట్లతో పాటు విదేశీ సిగరెట్లు తీసుకొచ్చిన ప్రయాణికులు సీఐఎస్‌ఎఫ్ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దుబాయ్ నుంచి ఈకే-524 విమానం మంగళవారం తెల్లవారు జామున 4 గంటలకు తనిఖీలు పూర్తి చేసుకుని అరవైల్ బయటికి వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన సీఐఎస్‌ఎఫ్ అధికారులు అతడిని వద్ద ఉన్న మూడు నల్లరంగు పెద్ద బ్యాగులను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో 259 ఈ-సిగరెట్లతో పాటు 200 బాక్సుల విదేశీ సిగరెట్లు పట్టుబడ్డాయి. తీసుకొచ్చిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు పెరుమల్‌పట్టుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. తీసుకొచ్చిన సిగరెట్లను అతడి నుంచి తీసుకునేందుకు డిపార్చుర్ దగ్గర ఉన్న వ్యక్తి మహ్మద్ ఇంతియాజ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. సిగరెట్లతో పాటు నిందితులిద్దరిని కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కస్టమ్స్ అధికారులు దర్యాప్తు చేపడుతున్నారు.